


రంజాన్ వేళలు

శుక్రవారం ఇఫ్తార్ : సాయంత్రం 6.31
శనివారం సహర్ : ఉదయం 5.02

కూడవెల్లి వాగులోకి
సాగునీరు విడుదల

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



గజ్వేల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): వట్టిపోయిన కూడవెల్లి శీర్షికతో ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద ఎస్కేప్ రెగ్యులేటరీ నుంచి కూడవెల్లి వాగులోకి సాగునీటిని గురువారం అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలపై ప్రభుత్వానికి తెలిసేలా చేసిన 'ఆంధ్రజ్యోతి'కి కూడవెల్లి పరీవాహక ప్రాంత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హుస్నాబాద్‌లో కళాశాల ఏర్పాటుకు
స్థల పరిశీలన

హుస్నాబాద్‌రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌కు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాల కోసం గురువారం కలెక్టర్ మనుచౌదరి స్థల పరిశీలన చేశారు. కళాశాలకు అనువైన 15 ఎకరాల స్థలాన్ని మండలంలోని జిల్లెలగడ్డ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల పక్కన, ఉమ్మాపూర్ శివారులోని మహాసముద్రం గండి ప్రాంతాన్ని, గాంధీనగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్థలాన్ని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కళాశాలకు సంబంధించి అనుకూలమైన ప్రభుత్వ భూమి ఏఏ సర్వేనంబర్లలో ఉందో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డిను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూరి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, యూనివర్సిటీ సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేటరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి); విద్యార్థులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని, సామగ్రిని పరిశీలించి మాట్లాడారు. కాలం చెల్లిన వస్తువులను ముందే గుర్తించి తొలగించాలని, ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని సూచించారు. ఆమె వెంట జడ్పీ సీఈవో రమేష్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో మురళీధర్‌శర్మ, తహసీల్దార్ వెంకటొరెడ్డి, ఎంఈవో రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బోయిని యాదగిరి, ప్రిన్సిపాల్ ఉన్నారు.



రంగుల కేళికి సిద్ధం



రంగుల కేళి.. హోలీకి చిన్నాపెద్దా సిద్ధమయ్యారు. ఒకరోజు ముందు నుంచే జిల్లావ్యాప్తంగా పండుగ సందడి మొదలయ్యింది. సిద్దిపేటలోని మెదక్ రోడ్డు, శుభాష్ రోడ్డు, మరికొన్ని వ్యాపార కూడళ్లలో రంగులు, స్ప్రే గన్నులు, రంగులు పిచికారి చేసే పరికరాలను చిన్నారులు కొనుగోలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో కామదహనం చేశారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

రంగుల పండుగ.. హోలీ | 7లో


హెచ్ఎండీఏ పరిధిలోకి
గజ్వేల్

- ఉమ్మడి కొండపాక మండలం మినహా నియోజకవర్గం పూర్తిగా అథారిటీలోకి
- జోన్ల వారీగా విభజన కానున్న భూములు
- మరోవైపు త్రిపుల్ ఆర్ నిర్మాణం
- పెరగనున్న పరిశ్రమలు, భూ విలువలు, ఉపాధి అవకాశాలు
- కన్జర్వేటివ్ జోన్ల అంశంలో భయాందోళనలో రైతులు, ప్రజలు
- శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్, మెట్రోతో మెరుగవనున్న రవాణా సౌకర్యం

గజ్వేల్ నియోజకవర్గ రూపరేఖలు మారనున్నాయి.. గతంలో నియోజకవర్గంలోని ములుగు, వర్గల్ మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండేవి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని ఆయా మండలాలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి చేరుస్తూ జీవో ఎంఎస్ 68ను జారీ చేసింది.

\- గజ్వేల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి)

గజ్వేల్ నియోజకవర్గం



జిల్లాలోని గజ్వేల్, జగదేవ్‌పూర్, ములుగు, వర్గల్, మర్కుక్, రాయపోల్ మండలాల్లోని పలు గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో చేరనున్నాయి. ఈ మండలాల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించనున్న రీజనల్ రింగ్‌రోడ్డు సైతం ఏర్పాటు కానుంది. ఇప్పటికే గజ్వేల్‌కు మనోహరాబాద్-కొత్తపల్లి రైలుమార్గం అందుబాటులోకి వచ్చింది. సికింద్రాబాద్ నుంచి గజ్వేల్‌కు వచ్చే రోడ్డు మార్గంలో ట్రాఫిక్ సమస్య వల్ల పలు పరిశ్రమల ఏర్పాటుకు, రవాణా సౌకర్యానికి ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో పాటు, మెట్రోవిస్తరణ చేపడుతుండడంతో రోడ్డు రవాణా మార్గం మెరుగవనుంది.

హెచ్ఎండీఏ పరిధిలోకి మూడు మండలాలు

గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్ మండలాల పరిధిలోని పలు గ్రామాలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ అథారిటీ పరిధిలోకి చేరుస్తూ ఈ నెల 12న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, బంగ్లావెంకటాపూర్, ధర్మారెడ్డిపల్లి, గజ్వేల్, కోమటిబండ, క్యాసారం, మక్తమాసాన్‌పల్లి, ముట్రాజ్‌పల్లి, ప్రజ్ఞాపూర్, సంగాపూర్, శ్రీగిరిపల్లి గ్రామాలు, జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అలీరాజ్‌పేట్, ధర్మారం, ఇటిక్యాల, జగదేవ్‌పూర్, పీర్లపల్లి గ్రామాలు, మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్, చేబర్తి,

మిగతా 8వ పేజీలో

ప్రశాంత వాతావరణంలో
హోలీ జరుపుకోవాలి

● సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలని సీపీ అనురాధ సూచించారు. హోలీ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీసుశాఖ తరపున శుభాకాంక్షలు తెలిపారు. యువత మద్యం సేవించి వాహనాలను నడపడం నేరమని, జిల్లా ప్రజలు సహజ సిద్ధమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. చెరువుల్లో, కాలువల్లో స్నానాలు చేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

పదోన్నతులు పోలీసుల బాధ్యతను మరింత పెంచుతాయని సీపీ అనురాధ తెలిపారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ బాగా గంగాధర్ తిలక్ ఏఎస్‌గా ప్రమోషన్ పొందిన సందర్భంగా ఆయన సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.





నెరవేరనున్న సొంతింటి కల

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

కొండాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సొంతింటి కల నెరవేరనున్నదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కొండాపూర్ మండల కేంద్రంలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. దశల వారీగా నిర్మాణానికి నిధులు మంజూరవుతాయని తెలిపారు. కేజీబీవీ బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. కేజీబీవీలో బాలికల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చేతి రాతతో రాస్తూ చదువుకోవాలని సూచించారు. చదువు, యోగా, మెడిటేషన్, కృతిమ మేధా(ఏఐ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్)పై కలెక్టర్ ప్రశ్నలు అడగగా సరైనా సమాధానాలు చెప్పిన విద్యార్థులను ప్రశంసించారు. వసతి గృహంలో కిచెన్ షెడ్, స్టోర్‌రూమ్, డైనింగ్‌హాల్, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులుకు నూతన మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతుందని, విద్యార్థులు ఏకగ్రతతో చదువుకోవాలని పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ చలపతిరావు, ఏఈ మాధవరెడ్డి, తహసీల్దార్ అనిత, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ ప్రదీప్, ఆర్ఐ మహదేవ్, కొండాపూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, పాఠశాల, వసతి గృహాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


పోలంపల్లి బిడ్డ.. మరువబోదు ఈ గడ్డ

నేడు సంస్మరణ దినం

రజాకార్ల గుండెల్లో మోగిన రణభేరి.. అనభేరి

నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రభాకర్‌రావు దళం పోరుబాట

మహ్మదాపూర్ గుట్టల్లో అసువులు బాసిన 12 మంది వీరులు


హుస్నాబాద్ బస్‌డిపో చౌరస్తాలోని అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం

హుస్నాబాద్ రూరల్, మార్చి 13 : పోలంపల్లి పులిబిడ్డ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేద ప్రజల విముక్తి కోసం సాయుధ పోరాటం నడిపి అసువులు బాసిన అమరుడు అనభేరి ప్రభాకర్‌రావు. రజాకార్ల దాడిలో నేకొరిగిన అమరుల సంస్మరణ దినం నేడు.


నేటికి 77 ఏళ్లు..

ప్రభాకర్‌రావు జన్మస్థలం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామం. జమీందార్ కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్‌రావు గ్రామాల్లో జరుగుతున్న పెత్తందార్ల దోపిడీ, అరాచకత్వాలు, బానిస విధానాలకు వ్యతిరేకంగా పోరుబాట పట్టాడు. ప్రజా సైన్యంతో వాడవాడలా ఎర్రజెండాలు ఎగరవేస్తూ పోరాటం సాగిస్తున్న దశలో 14 మార్చి 1948న ప్రభాకర్ దళం మహ్మదాపూర్‌కు చేరుకున్నది. గ్రామస్థులతో సమావేశమైన అనంతరం మాందాపురం శివారులోని గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటుండగా రజాకార్లు చుట్టిముట్టి దళంపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ఎదురొడ్డి పోరాటం సల్పిన ప్రభార్‌రావు దళం చివరకు నేలకొరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డితో పాటు, మరో పది మంది దళ సభ్యులు ముస్కు చొక్కారెడ్డి, ఎలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, గుండి దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారం, చిక్కుడు సాయిలు, రేండ్ల మాదవరెడ్డి హతమయ్యారు. మహ్మదాపూర్ గుట్టల ఎన్‌కౌంటర్‌లో అమరులైన 12 మంది అమరవీరుల స్మారకార్థం స్తూపాలు నిర్మించారు. ఈ సంఘటన జరిగి నేటికి 77 సంవత్సరాలు గడుస్తోంది.


మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి, సింగిరెడ్డి స్మారక చిహ్నాలు

పిట్టల వెంకన్న 41వ వర్ధంతి

ప్రభాకర్‌రావు ఆశయ సాధనకు ఆయన బాటలో నడిచిన వ్యక్తి, కమ్యూనిస్టు పోరాట యోధుడు మహ్మదాపూర్ గ్రామానికి చెందిన పిట్టల వెంకన్న. 30 సంవత్సరాలుగా ఏకగ్రీవ సర్పంచ్‌గా బాధ్యత చేపట్టి గ్రామాన్ని ఏకతాటిపై నడిపించారు. 1985 మార్చి 14న అనభేరి సంస్మరణ సభను ముగించుకుని ఓ పెళ్లికి హాజరై సేద తీరుతున్న వెంకన్నను కొందరు దుండగులు చుట్టుముట్టి హతమార్చారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- హోలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం ప్రకటనలో తెలిపారు. హోలీ సంబురాలను ప్రజలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. సంప్రదాయ పద్ధతుల్లో, చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించని ప్రకృతిలో లభించే సహజ రంగులను వినియోగించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలను నడపడం, బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్ల చల్లడం వంటివి చేయకూడదని సూచించారు. బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఆ వ్యక్తులపై చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలను తరచూ గమనిస్తూ వారికి సరైన మార్గాలను నిర్దేశించాలని తెలిపారు. యువత వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ లాంటివి మానుకోవాలని సూచించారు. హోలీ సందర్భంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రదేశాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ హోలీ మీ జీవితాలలో రంగులు నింపాలని కోరుకుంటూ సిబ్బందికి, సంగారెడ్డి జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య

జగదేవ్‌పూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిగడప గ్రామానికి చెందిన నర్ర బాలేశం నాగలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నర్ర ప్రవళిక(13) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం గ్రామానికి చేరుకున్నది. తల్లి నాగలక్ష్మి ఇంటి ఎదుట దుస్తులను ఉతుకుతుండగా ప్రవళిక కడుపునొప్పి వస్తుందని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నది. ఇంటి బయట ఉన్న తల్లి నాగలక్ష్మి ప్రవళికను ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. ఫ్యాన్‌కు వేళాడుతున్న ప్రవళికను చూసి తల్లి నాగలక్ష్మి బోరున విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి కిందికి దించారు. వెంటనే అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దుండిగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా దుద్దెడ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(20), ప్రవీణ్‌కుమార్(20) స్నేహితులు. వీరిద్దరు ఉపాధి కోసం నగర శివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మల్లంపేటకు వలస వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. అయితే గురువారం ఇద్దరు కలిసి సొంత పనులపై ద్విచక్రవాహనంపై ఉదయం 11:30 గంటలకు వెళ్తున్నారు. మంజు వైన్స్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు 108 సహాయంతో ఇద్దరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ గురువారం సాయంత్రం మృతిచెందాడు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ సంఘటన జరిగిన ప్రాంతం నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సాగు కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

సంగారెడ్డి టౌన్, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సాగు చేస్తూ పట్టుబడిన ఓ వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా అడిషనల్ సేషన్ కోర్టు న్యాయాధికారి తీర్పునిచ్చారు. సదాశివపేట మండలం తంగెడ్‌పల్లి గ్రామానికి చెందిన నాగులపల్లి వీరన్న 2020లో గంజాయిని సాగు చేస్తూ పట్టుబడగా సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ మధుబాబు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి కె.జయంతి పూర్వపారాలు పరిశీలించి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధించారు. అప్పటి ఎక్సైజ్ సీఐ జె. మధుబాబును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి.కమలాహాసన్‌రెడ్డితో పాటు డిప్యూటీ కమిషనర్లు హరికిషన్, కేఏబీ శాస్త్రీలు అభినందించారు.

భవానీమాత విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● రంజోల్‌లో హిందూ సంఘాల ఆందోళన


రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

జహీరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : రంజోల్‌లోని భవానీమాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను పట్టుకుని, కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో హిందూ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు గురువారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజోల్‌లోని భవానీమాత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విగ్రహాన్ని ధ్వంసం చేసి, ఆలయం బయట పడవేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అమ్మవారి మెడలో ఉన్న పుస్తెలు, కాళ్ల మెట్టెలను దొంగలించారని ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శివలింగం పోలీసులతో రంజోల్‌కు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో చేరుకుని ఆందోళనకారులను శాంతించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- 12 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి సామగ్రి స్వాధీనం
- మెదక్ కోర్టులో హాజరు పరిచిన పోలీసులు


మాట్లాడుతున్న సీఐ రేణుకారెడ్డి, పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు


పెద్దశంకరంపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం పెద్దశంకరంపేటలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి, సొత్తు రికవరీ చేసినట్లు సీఐ రేణుకారెడ్డి తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. సీఐ వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ ఈనెల 11న తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి కర్నాటకలోని ఘానగాపూర్‌కు వెళ్లారు. 12వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో పని చేసే ఆసిన్ బేగం వారి ఇంటికి వచ్చింది. బెడ్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఉండడంతో వెంటనే శ్రీనివాస్ గౌడ్‌కు తెలియజేశారు. అతని తమ్ముడు గంగాధర్‌గౌడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెడ్‌రూమ్ లాకర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన ఆరు తులాల బంగారు గొలుసు, ఐదు తులాల బంగారు పుస్తక దండం, తులానికి పైగా పుస్తే, మెట్టెలు, రెండు కేజీల వెండి ఆభరణాలు, రూ.6 వేల నగదు దొంగలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా దొంగలను పట్టుకున్నారు. పెద్దశంకరంపేట గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజుగౌడ్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసులు 12 తులాల బంగారు ఆభరణాలు, దాదాపు రెండు కిలోల వెండి వస్తువులు, 6000 నగదును రికవరీ చేసి, నిందితుడిని మెదక్ కోర్టులో హాజరు పర్చారు. ఈ సమావేశంలో ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మూడు రోజుల్లోనే దొంగతనం కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ


వృద్ధురాలిని విచారిస్తున్న సీఐ, ఎస్ఐ

తూప్రాన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఉదయం ఇంటిముంగిట ముగ్గేసి పక్కనే ఉన్న కిరాణ దుకాణం వద్దకు వెళుతున్న వృద్ధురాలి మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన తూప్రాన్ పట్టణంలో గురువారం ఉదయం చోటుచేసుకున్నది. ప్రత్యక్షసాక్షులు, బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణం ఎల్లమ్మ కమాన్ వద్ద నివాసం ఉండే కొత్తకొండ రామారావు తల్లి కొత్తకొండ రంగమ్మ(80) ఉదయం 7 గంటలకు ఇంటి ముంగిట ముగ్గేసింది. అనంతరం పక్కనే ఉండే కిరాణ దుకాణం వద్దకు వచ్చి చూడగా బందు చేసి ఉంది. అప్పుడే బైక్‌పై వచ్చి ఆగిన గుర్తుతెలియని ఓ యువకుడిని కామదహనం రాత్రి జరిగిందా? అంటూ రంగమ్మ ప్రశ్నించగా, తెలుగు రాదంటూ చెప్పాడు. అటు ఇటు చూసి రంగమ్మ మెడలో ఉన్న ఆరు తులాల బంగారు గొలుసును బలంగా లాగాడు. గొలుసు తెగిపోయి, మెడకు గాయమైంది. వృద్ధురాలు కేకలు వేయగా, దొంగ అక్కడి నుంచి బైక్‌పై పారిపోయే ప్రయత్నం చేశారు. పారిపోతుండగా బైక్ కింద పడటంతో అక్కడే వదిలి పారిపోయాడు. నంబరు ప్లేట్ లేకుండా ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.





రంగుల పండుగ.. హోలీ

● రసాయన రంగులతో అనారోగ్య సమస్యలు.. ● సహజ సిద్ధమైనవే వాడాలంటున్న నిపుణులు



దౌల్తాబాద్/కొండపాక/మెదక్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులు, యువత ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న రంగుల పండుగ రానే వచ్చింది. హోలీలో వాడే రంగుల తరహాలోనే ప్రతీ ఒక్కరి జీవితం రంగుల మయం కావాలని అందరూ కోరుకుంటుంటారు. కానీ, రంగుల పండుగ మాటున ప్రమాదం పొంచి ఉందని, రసాయన రంగుల వినియోగంతో చర్మ వ్యాధులు, దృష్టి లోపాలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హోలీ ఆడేటప్పుడు విధిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వీలైనంత వరకు రసాయన రంగులు వాడకపోవడమే ఉత్తమమని, ప్రత్యామ్నాయంగా సహజ సిద్ధ రంగులు(హెన్నా, పసుపు, కుంకుమ, చందనం, బుక్క గులాలు, మోదుగు పూలు, టమాట గింజలతో తయారు చేసినవి) వాడాలని సూచిస్తున్నారు. హానికరమైన రంగులతో శరీరంపై దురుద, మంట రావడంతోపాటు పొడి రంగు గాలిలో కలిసిపోయి నోరు, ముక్కు ద్వారా ఊపిరితిత్తుల్లో చేరి ఆస్తమా, ఎలర్జీ ఇతర ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హోలీ స్పెషల్.. పిడిగుద్దులాట

శివ్వంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ అంటేనే ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోవడం. కానీ మెదక్ జిల్లా శివంపేట మండలం కొంతాన్‌పల్లిలో పిడిగుద్దులాట జరుపుకోవడమే హోలీ స్పెషల్. ఏటా గ్రామంలో హోలీ వేడుకల్లో భాగంగా దీన్ని నిర్వహిస్తారు. గురువారం గ్రామంలో నిర్వహించిన పిడిగుద్దులాట జాతరను తలపించింది. పిడిగుద్దులాట నిర్వహించకుంటే గ్రామంలో ఏదైనా అరిష్టం జరుగుతుందేమోనని గ్రామస్థుల నమ్మకం. పురుషులు మాత్రమే పాల్గొనే ఈ కార్యక్రమంలో కొందరికి గాయాలు కూడా అవుతుంటాయి.



నీటి వృథాను అరికట్టాలి

రంగుల్లో అపరిశుభ్రమైన నీటిని కలిపి చల్లుకోవడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. పట్టణాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైన తరుణంలో హోలీ పేరిట నీటిని వృథా చేయకూడదని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. హోలీ ఆడిన తరువాత స్నానానికి చెరువులు, కుంటలకు వెళ్లే యువత జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఈత రాకుంటే చెరువులోకి దిగకపోవడం ఉత్తమమని, జలాశయల వద్ద పోలీస్‌లు భద్రత ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



రంగులు చల్లుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు, హోలీ ఆడే సమయంలో తల్లిదండ్రులు దగ్గరుండి చూసుకోవాలి. ముఖ్యంగా కండ్లలో, గొంతులో, చెవులలో రంగు పోకుండా చూసుకోవాలి. కండ్లకు అద్దాలు తలకు టోపీ ధరించాలి. ఒకవేళ కళ్లలో రంగు పడితే వెంటనే శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వైద్యులను సంప్రదించాలి.

-కిరణ్ రెడ్డి, మెదక్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

మొన్న కామ దహనం.. నేడు హోలీనా.!?

రామాయంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడైనా కామ దహనం జరిగిన మరుసటి రోజు హోలీ జరపటం ఆనవాయితీ. కానీ.. మొట్టమొదటిసారిగా మెదక్ జిల్లా రామాయంపేటలో ఇందుకు భిన్నంగా జరిగింది. గురువారం హోలీ అని భావించిన పట్టణ ప్రజలు బుధవారం రాత్రి కామ దహనం నిర్వహించారు. పండుగ నేపథ్యంలో గురువారం వ్యాపారులు దుకాణాలు సైతం తెరువాలేదు. కానీ ఏ ఒక్కరూ రంగులు చల్లుకోవడానికి ముందుకు రాలేదు. కాగా, శుక్రవారం రామాయంపేటలో హోలీ పండుగ జరుపుకోనున్నట్లు తేటతెల్లమైంది. దీంతో ప్రజలు ఔరా.. ఇదే చోద్యం.. అంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.



ఇలా చేద్దాం..

- రసాయన రంగులను వాడాల్సి వస్తే అవి శరీరంపై ఎక్కువ సేపు ఉండకుండా చూసుకోవాలి.
- ఎరుపు, పింకు కలరు రంగులు వాడితే మంచిది. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండడంతో శరీరంపై నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఆరెంజ్, పసుపు రంగులు అధిక మోతాదులో రసాయనాలు కలిగి ఉంటాయి. ఇవి శరీరంపై నుంచి తొలగించడం కష్టం
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి, జుట్టుకు నూనె రాసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. సులభంగా శుభ్రం చేసుకోవచ్చు.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా షాంపో వాడటం మంచిది.
- రంగులకు పలు రకాల ఆయిల్ కలిపి శరీరానికి రాస్తుంటారు. ఇలా చేయడం వల్ల వాటిని శుభ్రం చేయడం కష్టం. ఎక్కువ నీటిని వినియోగించాల్సి ఉంటుంది.
- రంగునీళ్లు, పొడి కళ్లల్లో పడకుండా కంటి అద్దాలు వాడాలి
- కోడి గుడ్ల ద్రావణాన్ని రంగుల్లో కలపకూడదు
- శరీరంపై గాయాలుంటే బ్యాండెజ్ వేసుకోవాలి.
- ముఖంపై దద్దుర్లు, తామర వంటివి ఉంటే మొదట సంబంధిత ఆయింట్మెంట్, తరువాత నూనెను రాయాలి.
- మొదట సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసాక, నూనె రాసుకోవాలి.
- బాలికలు, మహిళలు తమ చేతివేళ్లకు దట్టంగా నెయిల్ పాలిష్‌ను వేసుకోవాలి.
- రంగుల వల్ల అలెర్జీ అనిపించిన చోట, నీటితో కడిగాక ఐస్‌తో మర్దన లేదా పెరుగు రాయడం వంటివి చేయాలి. అలోవెరా జెల్ కూడా రాయొచ్చు.
- రంగు పూర్తిగా తొలగకపోతే అలోవెరా జెల్ లేదా పెరుగుతోనే శుభ్రం చేయాలే కానీ, బ్లీచ్ చేయించుకునేందుకు బ్యూటీ పార్లర్‌కు వెళ్లకూడదు.
- రంగుల్లో ఉండే రసాయనాలు, చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించవచ్చు. అందువల్ల హోలీ ఆడిన వెంటనే బ్యూటీపార్లర్‌కు వెళ్లకూడదు. కనీసం ఐదు రోజులైనా వ్యవధి ఇవ్వాలి.
- అన్నింటికన్నా ముఖ్యంగా హోలీ వేడుకలో పాల్గొనేముందు తగినన్ని నీళ్లు తాగాలి.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● ఏటీఎస్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్

పటాన్‌చెరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఇంజినీర్లు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆస్ట్రియాలోని ఏటీఅండ్ఎస్ ఏజీలో అప్లికేషన్ ఇంజినీరింగ్ గ్లోబల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ మొక్కపాటి సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నిక్స్' పై గురువారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. టూడీ, త్రీడీ, అభివృద్ధి చెందుతున్న ఫోర్ డీ ప్యాకేజింగ్‌తో సహా సెమీకండక్టర్ ప్యాకేజింగ్ టెక్నాలజీలలో తాజా పురోగతుల గురించి విద్యార్థులతో పంచుకున్నారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, కార్యక్రమ నిర్వాహకుడు ప్రొఫెసర్ ఎం.ప్రశాంత రెడ్డి అతిథిని సత్కరించారు. అదేవిధంగా దుర్గం చెరువు వద్ద గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ చార్ కోల్ వర్క్‌షాప్ నిర్వహించింది. 'బ్లాంక్ కాన్వాస్ నుంచి మాస్టర్ పీస్ వరకు' అనే ఇతివృత్తంతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో బాలల నుంచి వయోజనుల వరకు, అన్ని వయస్సుల వారు పాల్గొని సృజనాత్మకతకు పదును పెట్టారు.

విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేస్తాం

● టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



కార్యక్రమంలో వినియోగదారులు, అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జోన్‌లో విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. మేడ్చల్ జోన్‌లోని హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్లలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను గురువారం ఆయన సమీక్షించారు. సర్కిళ్ల పర్యటనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన పీటీఆర్, ఫీడర్లను వినియోగదారుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ మేడ్చల్ జోన్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను అంచనా వేసి దానికి తగ్గట్టు విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. గత వేసవిలో మేడ్చల్, బౌరంపేట్, అమీన్ పూర్, బాచుపల్లి, ప్రగతి నగర్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, మియాపూర్, పఠాన్‌చెరు, మయూరి నగర్ వంటి ప్రాంతాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో సాంకేతిక సర్వే చేసి భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లలో అదనంగా 62 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, 1081 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను, 243, 11 కేవీ ఫీడర్లను, 37, 33 కేవీ ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేడ్చల్ జోన్ పరిధిలో 15 నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కమర్షియల్ డైరెక్టర్ సాయిబాబా, మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ కామేష్, సూపరింటెండింగ్ ఇంజినీర్లు బ్రహ్మం, రవికుమార్, శ్రీనాథ్, డివిజనల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలకు కొత్త లెక్చరర్లు

● జిల్లాకు 52 మంది ఆధ్యాపకుల కేటాయింపు

● తీరనున్న బోధన తిప్పలు

మెదక్ అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కొత్త ఆధ్యాపకులు వచ్చారు. 13 ఏళ్లుగా పూర్తి స్థాయిలో లెక్చరర్లు లేక కాలేజీల్లో బోధన అంతంత మాత్రంగా సాగుతోంది. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త ఆధ్యాపకులు నియామక పత్రాలు అందుకున్నారు. మెదక్ జిల్లాకు 52 మంది లెక్చరర్లను కేటాయించారు. వారు త్వరలోనే విధుల్లో చేరనున్నారు.

పదోన్నతులోనే సరి..

ఏళ్ల తరబడి సర్కార్ లెక్చరర్ల నియామకాలను చేపట్టలేదు. అయితే 2014, 2016, 2019, 2021లో పదోన్నతులు కల్పించారు. గత బీఆర్ఎస్ సర్కార్ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసింది. వీరితోపాటు కొందరు కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లతో బోధన సాగుతోంది. దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కొత్త నియామకాలు చేపట్టడంతో జిల్లాకు 52 మంది కొత్త అధ్యాపకులు రానున్నారు. దాంతో లెక్చరర్ల కొరత తీరనుంది.

జిల్లాలో ఇలా...

మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా.. దాదాపు 6 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం రెగ్యులర్ లెక్చరర్లు 129 మంది, గెస్ట్ 68, కాంట్రాక్టు 10, తాత్కాలిక 3 మంది పని చేస్తున్నారు. జిల్లాలో 68 పోస్టులు ఖాళీలు ఉండగా.. కొత్తగా 52 మంది ఆధ్యాపకులు రానున్నారు.

పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి

● రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్ రాజగోపాల్ రావు



పరిశ్రమలో మొక్కలు నాటుతున్న రాజగోపాల్ రావు

మనోహరాబాద్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో కార్మికుల కోసం భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ రాజగోపాల్ రావు అన్నారు. భద్రతతో కూడిన జీవన విధానం అలవర్చుకుని వికసిత్ భారత్ లక్ష్యం వైపు ప్రయాణం చేయాలని సూచించారు. గురువారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 54 వ జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయనతోపాటు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ లక్ష్మీకుమారి హాజరయ్యారు. అనంతరం రాజగోపాల్ రావు మాట్లాడుతూ పరిశ్రమలు భద్రతతో కూడిన ఉత్పత్తిని విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి సాధించడంపై పరిశ్రమలు దృష్టి పెట్టాలన్నారు. కార్మికులు ప్రమాదాలు బారి పడకుండా పరిశ్రమలు నడిపించాలని అన్నారు. ఎమ్మెస్ అగర్వాల్ 54 వ జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం పరిశ్రమ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు వసంత్ కుమార్, చక్రవర్తి, నరసింహం, పీఆర్ఏఈ వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

చేర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో గురువారం నిర్వహించతలపెట్టిన సీల్డ్‌టెండర్ కమ్ బహిరంగ వేలం అనివార్య కారణాల వలన వాయిదా వేశారు. ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల సెల్‌ఫోన్ భద్ర పరిచడానికి, షాపింగ్ కాంప్లెక్స్ లీజ్, ప్రసాద కౌంటర్ పక్కన పూజా సామాగ్రి విక్రయానికి లైసెన్స్ జారీకోసం టెండర్ల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువరచడంతో పలువురు షెడ్యూల్స్ దాఖలు చేశారు. గురువారం టెండర్ల నిర్వహణను వాయిదా వేశామని, వచ్చే మంగళవారం టెండర్లు జరుపుతామని ఈవో రామాంజనేయులు తెలిపారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

మెదక్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని మిర్జిపల్లి తండాకు చెందిన మహిళ 108 అంబులెన్స్‌లో గురువారం ఉదయం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తండాకు చెందిన స్వప్న పురిటినొప్పులతో బాధపడుతున్నది. వైద్య సిబ్బంది ఆమెను 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువయ్యాయి. మార్గమధ్యలో సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, రమేష్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. పండంటి మగబిడ్డకు జన్మనివ్వడంతో తల్లి, బిడ్డను మెదక్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.

విద్యార్థినుల పోషకాహారానికి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తోడ్పాటు

● రూ.9.5 లక్షల విలువైన ఎంఓయూపై సంతకాలు



ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్

కంది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఎద్దుమైలారం వద్ద ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉమ్మడి మెదక్ జిల్లాలోని పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యం సంరక్షించడానికి, పోషకాహారానికి తోడ్పాటు అందించనున్నది. ఈ మేరకు గురువారం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ సందర్భంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు రూ.9.5 లక్షల విలువైన ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాల విద్యార్థినుల పోషకాహారాన్ని మెరుగుపరచడం కోసం కృషి చేస్తున్నట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్ పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ఏవీఎన్ఎల్ ద్వారా సేవా కార్యక్రమాల ప్రయత్నాల్లో మరొక మైలురాయిని సూచిస్తుందని తెలిపారు.

క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకుల్లో ఐఐటీహెచ్ సత్తా

● ఆరు సబ్జెక్టులలో ఉత్తమ స్థానాలు

కంది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ పాఠ్యాంశాల బోధనలో తన సత్తా చాటి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల సరసన నిలిచింది. బోధనలో ఏకంగా ప్రపంచంలోని టాప్ వర్సిటీల జాబితాలో చేరింది. ఐఐటీహెచ్‌లో ఉన్న పాఠ్యాంశాల ర్యాంకులను మెరుగుపర్చుకోవడంతోపాటు మరో 6 పాఠ్యాంశాల ర్యాంకులను యథాతథంగా కాపాడుకోగలిగింది. ప్రపంచ వ్యాప్తంగా 1700 విశ్వవిద్యాలయాల్లో 55 రకాల పాఠ్యాంశాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ ఎడిషన్‌ను రూపొందించారు. ఈ విశ్లేషణాత్మక అధ్యయనంలో ఐఐటీహెచ్ విశేష ప్రతిభను ప్రదర్శించింది. అంతర్జాతీయ విద్యావిశ్లేషకుడు క్వాక్వారెల్లి సైమండ్స్ గురువారం ఈ జాబితాను విడుదల చేశారు. క్యూఎస్ వరల్డ్ వర్సిటీ సంస్థ ప్రకటించిన ర్యాంకుల్లో ఆరు సబ్జెక్టులకు ప్రకటించిన జాబితాలో ఐఐటీ హైదరాబాద్ చోటు దక్కించుకుంది. మెకానికల్-ఏరోనాటికల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్, ఫిజిక్స్‌అస్ట్రోనమీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ-మెటీరియల్స్‌సైన్స్ సబ్జెక్టులు ర్యాంకుల జాబితాలో ఉత్తమ స్థానాలు సాధించాయి. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం మొదటిసారిగా 501-550 మధ్య ర్యాంకు పొందడం విశేషం. విద్య, పరిశోధన నైపుణ్యాలకు ఐఐటీహెచ్ పెద్దపీట వేస్తుందనడానికి ఈ ర్యాంకులే ఉదాహరణ అని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్

కిడ్నీలపై జాగ్రత్త తప్పనిసరి

సిద్దిపేట టౌన్, మార్చి13(ఆంధ్ర జ్యోతి): కిడ్నీల పట్ల జాగ్రత్త వహించాలని జీజీహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి సూచించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో (జీజీహెచ్) ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా రోగులకు కిడ్నీ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు ఏదైనా నొప్పి వస్తే పెయిన్ కిల్లర్ మాత్రలను వాడుతున్నారని, వాటిని ఎక్కువగా వాడటం ద్వారా కిడ్నీలపై ప్రభావం చూపిస్తుందని వివరించారు. వీలైనంత వరకు పెయిన్ కిల్లర్ మాత్రలకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, జంక్‌ఫుడ్‌ను తీసుకోవద్దన్నారు.కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు గీత, హెచ్‌వోడీ మాధవ్, ఆర్ఎంవో జ్యోతి, డయాలసిస్ ఇన్‌చార్జి రాజు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై మల్లన్న భారం

● పన్ను వసూళ్లపై అధికారుల ఫోకస్ ● అయినా తప్పని వెనుకబాటు ● భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు

గజ్వేల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై మల్లన్న భారం పడింది. వార్షిక సంవత్సరం ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అటు గ్రామపంచాయతీల్లో, ఇటు మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది మున్సిపల్ పరిధిలో పన్ను వసూళ్లను వేగిరం చేశారు. దీంతో మున్సిపాలిటీపై మల్లన్నసాగర్ భారం పడింది. మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో అందుకు సంబంధించిన ఇళ్ల పన్నులు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో చేరుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు సైతం పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల ర్యాంకింగ్‌లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వెనుకబడిపోయింది.



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

రూ. 40 లక్షల బకాయిలు

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులకు ఇళ్లు, ప్లాట్ల కేటాయింపునకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న క్రమంలో గజ్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోకి వచ్చి చేరుతున్నాయి. మునిసిపల్ పరిధిలోని భూములు కావడం, మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఇళ్లు కావడంతో మున్సిపల్ పరిధిలోకి డైరెక్ట్‌గా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నుంచి వచ్చి చేరుతుంది ఈ క్రమంలోనే భారీగా పెండింగ్ బకాయిలను మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోతున్నాయి. మల్లన్న సాగర్ భూనిర్వాసితులకు చెందిన 2,168 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ. 40,98,514 మున్సిపాలిటీ పరిధిలో బకాయి పడినట్లు రికార్డులు చూపుతున్నాయి. దీంతో ఎన్ని పన్నులను వసూలు చేసినా ర్యాంకింగ్‌లో ముందుకు సాగడం లేదు.

పన్ను వసూళ్లలో 25వ స్థానం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు 18 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ. కోటి 14లక్షల 95 వేల బకాయిలు ఉండగా ఈ ఏడాది కేవలం రూ. 4 లక్షల పన్నులు మాత్రమే ప్రభుత్వ కార్యాలయాల అధికారులు చెల్లించారు. మిగిలిన రూ. కోటి 10లక్షల 95వేల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు కేటాయించే పన్ను వసూళ్ల ర్యాంకింగ్‌లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వెనుకబడిపోయింది. ఈ కారణంగానే టాప్-5లో ఉండాల్సిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ 25వ స్థానంలో నిలిచిందని మున్సిపల్ అధికారి ఒకరు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. వ్యక్తి మృతి


దుర్గాప్రసాద్(ఫైల్)

వర్గల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారం రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి వలస వచ్చి గౌరారంలో నివాసముంటున్న దుర్గాప్రసాద్(28) గ్రామ సమీపంలోని ఓ పరిశ్రమలో రోజు వారి కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న పని ముగించుకుని బైక్‌పై గౌరారం వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ బైకును మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల కూతురు, రెండు నెలల పాప ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగిన వివాహిత..

కోహెడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యతో పురుగులమందు తాగిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో వివాహిత వేల్పుల విమల(40)కు ముగ్గురు కుమారులు సంతానం. ఆమెకు గర్భసంచిలో గడ్డలు కావడంతో కరీంనగర్‌లో ఆపరేషన్ నిర్వహించారు. నాటినుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో తీవ్ర మనోవేదన గురైన విమల ఈనెల 11న క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు 108 ద్వారా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ చెప్పారు.

డంకెన్‌డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ. 27,500 జరిమానా విధించారు.

విద్యాసంస్థల్లో ముందస్తు హోలీ సంబురాలు




సిద్దిపేట, హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సహజ రంగులతో హోలీ సంబురాలు, రాయపోల్ మండలం బేగంపేట స్కూల్‌లో చిన్నారుల సందడి

సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్/మర్కుక్/రాయపోల్/మిరుదొడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పలు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రకృతి సిద్ధమైన రంగులను వాడటం వల్ల వాతావరణ సమతుల్యతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సహజ రంగులతో ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా జి సునీత, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డా. రాణి ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులతో వివిధ రకాల పువ్వులు, ఆకులను ఉపయోగించి సహజసిద్ధమైన రంగులని తయారు చేసే పద్ధతులను వివరించి, స్వయంగా తయారు చేయించారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు సహజసిద్ధమైన రంగుల గురించి వివరించి వారితో తయారు చేయించారు. బీట్‌రూట్‌ను ఉపయోగించి ఎరుపు రంగు, బంతిపూలు, పసుపును వినియోగించి పసుపు కలర్, అలాగే పాలకూరను ఉపయోగించి ఆకుపచ్చ రంగు, మోదుగు పూలను ఉపయోగించి అరెంజ్ కలర్‌ను తయారు చేయించారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని వివరించారు. మర్కుక్ మండల పరిధిలోని చేబర్తి-11 అంగన్వాడీ కేంద్రంలో భోజనం విరామం అనంతరం అంగన్‌వాడీ టీచర్ రాణి ఆధ్వర్యంలో చిన్నారులు మోదుగ పువ్వుతో తయారుచేసిన రంగులను చల్లుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. రాయపోల్ మండలం బేగంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పరస్పరం రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె, భూంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ముందస్తు హోలీ సంబురాలతో సందడి చేశారు.

జాతీయస్థాయి యూనివర్సిటీ పోటీలకు మిరుదొడ్డి క్రీడాకారులు




పోటీలకు ఎంపికైన ప్రణయ్, చేతన్, యువతేజ

మిరుదొడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యూనివర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన అందె చేతన్, వేముల యువతేజ, మద్దెల ప్రణయ్ ఎంపికయ్యారు. ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన యూనివర్సిటీస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీల్లో వారు మంచి ప్రతిభను కనబర్చడంతో ఉస్మానియా, జెఎన్‌టీయూ యూనివర్సిటీ జట్లకు ఎంపికయ్యారు. ఈ నెల 14నుంచి 17వరకు కర్ణాటకలోని బెంగూళురు నార్త్ యూనివర్సిటీలో జరగనున్న జాతీయస్థాయి యూనివర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్టు బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండ గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.లక్ష విలువ చేసే 20 డెస్కులను దాతలు అందజేయగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు డెస్కులను అందజేసిన తూం పద్మను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆంజనేయులు, స్వామి విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్, ఉపాధ్యాయులెచ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు


పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు

మర్కుక్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా చాలెంజ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ రాములుగౌడ్ అధ్యక్షతన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి రాజేశ్వరరావు మొక్కను నాటి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్, బీఆర్ఎస్ నాయకులు కళ్యాణ్, కార్తీక్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కోహెడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో పార్టీ నాయకుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఓ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ముంజ తిరుపతి గౌడ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంపునకు కృషి చేయాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో జయదేవ్ ఆర్య

సిద్దిపేట రూరల్,మార్చి 13(ఆంధ్రజ్యోతి); కూలీల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని, అందుకు పని ప్రదేశాలను గుర్తించి కూలీలకు పని కల్పించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య సిబ్బందికి సూచించారు. గురువారం నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా పని ప్రదేశంలో కనీస వసతులు, సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్ రావు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

చేర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అమలుపరచకపోవడం తగదని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇంచార్జి మల్లిగారి యాదగిరి విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో వర్గీకరణ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేర్యాల అంగడిబ జారు చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు.

● హుస్నాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొలుగూరి అశోక్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనగందుల లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

హుస్నాబాద్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గోవధ నిషేధ చట్టాన్ని హుస్నాబాద్‌లో అమలు చేయాలని గురువారం బీఎస్పీ, గో సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హుస్నాబాద్ పశువుల సంతలో ఆరోగ్యంగా ఉన్న పశువులను వెటర్నరీ డాక్టర్ అనుమతి లేకుండా అక్రమంగా పశువధశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, శంకర్, రాజు తదితరులున్నారు.

పరిశ్రమ నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు


పరిశ్రమ పనులను అడ్డుకుంటున్న రైతులు

ములుగు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునికిబొల్లారం గ్రామ శివారులో ఓ ప్రైవేట్ పరిశ్రమ నిర్మాణ పనులను గురువారం పలువురు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. టీఎస్ఐఐసీ ప్రభుత్వ పరిశ్రమల సంస్థ తమ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, భూమికి డబ్బులు ఇవ్వకుండా 340 సర్వే నెంబర్‌లో గల తమ ఎకరం భూమిని ఓ పరిశ్రమకు అప్పగించడంతో ఆ పరిశ్రమ యజమానులు నిర్మాణం కోసం గురువారం పనులు మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న రైతు వీరన్నగారి ఇంద్రసేనారెడ్డి, తన సోదరులు వీరన్నగారి పోచిరెడ్డి, వీరన్నగారి దేవేందర్‌రెడ్డి పరిశ్రమ నిర్మాణం కోసం గుంతలు తీస్తున్న ఎక్స్‌కవేటర్‌కు అడ్డుపడ్డారు. పరిశ్రమ యజమానులు టీఎస్ఐఐసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి తహసీల్దార్ అరిఫా, టీఎస్ఐఐసీ జోనల్ స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్ చేరుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమనిగింది. కాగా అధికారులు ఆ సర్వే నెంబర్‌లో గల భూమికి సంబంధించి మొత్తం డబ్బులు ప్రభుత్వం ద్వారా రైతులకు అందినట్టు చెబుతున్నారు. ఒకవేళ సంబంధిత డబ్బు అందకపోతే పై అధికారులతో మాట్లాడి ఇప్పిస్తామని తహసీల్దార్ అరీఫా తెలిపారు. అయితే బాధిత రైతులు మాత్రం తమకు డబ్బులు వద్దు.. మా భూమి మాకే కావాలని పట్టుబడుతున్నారు. పరిశ్రమ యజమానులు మాట్లాడుతూ రూ.కోట్లు రుణాలు తీసుకొచ్చి పరిశ్రమ నిర్మాణానికి వెచ్చిస్తే రెండేళ్ల గడిచినా పనులకు ఆటంకం కలిగించడమేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

చేర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన నిరుపేద వ్యక్తికి పలువురు అండగా నిలిచారు. చేర్యాల పట్టణానికి చెందిన పోగుల శ్రీకాంత్ ఇటీవల పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలపాలై అపస్మారకస్థితిలో ఆస్పత్రిలో చేరాడు. నిరుపేద కుటుంబంకావడంతో వైద్యఖర్చులకు ఇబ్బందులుపడుతున్నారు. ఇది గమనించిన పట్టణానికి చెందిన సామాజిక సేవకులు అయిత రాము, అయిత లక్ష్మణ్, తాహీర్, అయిత నందు తదితరులు ఆర్థికసాయమందించి అండగా నిలిచారు. అంతేగాకుండా పలువురి నుంచి పోగు చేసిన రూ.54,600నగదును వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం శ్రీకాంత్ కుటుంబానికి అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వాటర్‌కూలర్ వితరణ

చేర్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవిదృష్ట్యా విద్యార్థులు చల్లని నీటితో దాహార్తి తీర్చుకునేందుకు చేర్యాల లయన్స్‌క్లబ్ ప్రతినిదులు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలకు వాటర్ కూలర్‌ను విరాళంగా అందించారు. గురువారం క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్. దీపాంజలి చేతులమీదుగా కళాశాల ప్రిన్సిపాల్ సునితకు అందజేశారు.

డిగ్రీ కళాశాలలో హోమియోపతి వైద్య శిబిరం

వర్గల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాఫూలే మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం హంస హోమియోపతి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూత్రం, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వెరునిక, శృతి పాటిల్, కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. వర్గల్ మహాత్మా జ్యోతిబాఫూలే మహిళా డిగ్రీ కళాశాలలో దశాబ్ది ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం కళాశాల ప్రాంగణంలో క్రీడాపోటీలు నిర్వహించారు.

విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం

● బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్ రెడ్డి

గజ్వేల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జివంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014లో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూ.ఒక లక్ష 600 కోట్లు మాత్రమే ఉండేదని, 2022-23 సంవత్సరానికి గానూ బడ్జెట్ రూ.3 లక్షల 99 వేల కోట్లకు చేరిందన్నారు. తెలంగాణ ఏర్పడిన రోజు కేవలం 60 లక్షల ఎకరాల్లో మాత్రమే ఆయా పంటల సాగు ఉండేదని, కాళేశ్వరం ప్రాజెక్టు కింద రెండు లక్షల ఎకరాల ప్రత్యక్ష సాగుతో పాటు పరోక్షంగా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ప్రభుత్వానికి ప్రజల కష్టాలు పట్టడం లేదని, దేవాదుల కింద సాగు చేసిన 50వేల ఎకరాల పంట ఎండుతుందని విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉండగా, అధికారులు ప్రోటోకాల్ లేని వ్యక్తులతో కొబ్బరికాయలు ఎలా కొట్టించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు జకీయోద్దీన్, నవాజ్ మీరా, బెండ మధు, గంగిశెట్టి రవీందర్, మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, ఊడెం కృష్ణారెడ్డి, ఆకుల దేవేందర్ తదితరులున్నారు.

వర్గల్ అభివృద్ధికి ప్రాధాన్యం: నర్సారెడ్డి

వర్గల్/గజ్వేల్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తనకు రాజకీయ జన్మనిచ్చిన వర్గల్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్‌లోని ఎస్సీ కాలనీలో రూ. 40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి రూ. 5 కోట్లు కేటాయించారని వివరించారు. రూ. 200 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సందీప్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కాగా కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డులోని ఎడ్యుకేషన్ హబ్ వద్ద గల ఆమె విగ్రహానికి శాలివాహన కుమ్మర సంఘం నాయకులతో కలసి తూంకుంట నర్సారెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి: అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి కొండా సురేఖ, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఎండీఏ పరిధిలోకి గజ్వేల్

(5వ పేజీ తరువాయి)

ములుగు మండల పరిధిలోని అచ్చాయిపల్లి, అడవిమజీద్, బైలంపూర్, బండమైలారం బండతిమ్మాపూర్, బస్వాపూర్, క్షీరసాగర్, చిన్నతిమ్మాపూర్, దాసర్లపల్లి, గంగాధర్‌పల్లి, కొక్కొండ, కొత్తూరు, కొట్టాల, లక్ష్మక్కపల్లి, మామిడ్యాల్, ముస్తఫాగూడ, నర్సంపల్లి, నర్సాపూర్, సింగాయపల్లి, సింగన్నగుడా, శ్రీరాంపూర్, తానేదారుపల్లి, తునికిబొల్లారం, రాయపోల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి, బేగంపేట, ఎల్కల్, వర్గల్ మండల పరిధిలోని అంబర్‌పేట, అనంతగిరిపల్లి, చందాపురం, గౌరారం, గిర్మాపూర్, గోవిందాపూర్, జబ్బాపూర్, కొండాయిపల్లి, మాదారం, మైలారం, మజీద్‌పల్లి, మీనాజీపేట్, నాచారం, నెమ్టూర్, రామచంద్రపూర్, శాకారం, సింగాయపల్లి, సీతారాంపల్లి, తునికికాల్సా, తునికిమక్త, వర్గల్, వేలూరు గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలోకి చేరిపోయాయి.

జోన్లవారీగా భూముల విభజన

గజ్వేల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వెళ్లడంతో భూములు జోన్లవారీగా విభజన కానున్నాయి. ఈ నేపథ్యంలో రెసిడెన్షియల్ జోన్, అగ్రికల్చర్ జోన్, పెరి అర్బన్ జోన్, రిక్రియేషన్ జోన్, ఆర్-1 జోన్, ఆర్-2 జోన్, ఆర్-3, ఆర్-4 జోన్లుగా భూములు విభజన కానున్నాయి. కన్జర్వేటివ్(అగ్రికల్చర్) జోన్ ఎక్కడ తమ దాంట్లో వచ్చి పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేగం పుంజుకోనున్న త్రిపుల్‌ఆర్ పనులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం త్వరలోనే వేగం పుంజుకోనుంది. నియోజకవర్గంలో 32 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది. రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న గ్రామాలను హెచ్ఎండీఏ పరిధిలోకి చేరుస్తూ నిర్ణయం తీసుకోవడంతో దీర్ఘకాలిక ఆలోచనలతో ప్రభుత్వం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్ఎండీఏ పరిధిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొంటున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం రెండు మూడు నెలల్లో చేపట్టేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న నేపథ్యంలో రింగ్ రోడ్డు చుట్టూ భూ విలువలు భారీగా పెరగనున్నాయి. అంతేకాకుండా రవాణా మార్గం మెరుగవుతుండడంతో పరిశ్రమలు తరలిరానున్నాయి. సికింద్రాబాద్ పరిధిలోని జేబీఎస్ నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట వరకు రోడ్డు చిన్నదిగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ రోడ్డు గుండా వచ్చే ప్రజలు పారిశ్రామికవేత్తలు, ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంతో పాటు జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు మెట్రో నిర్మాణాన్ని చేపట్టనున్న నేపథ్యంలో రోడ్డు, రైలు మార్గం అందుబాటులోకి వస్తుండడంతో రవాణా సౌకర్యాలు మెరుగవనున్నాయి. శామీర్‌పేట నుంచి గజ్వేల్ నియోజకవర్గం కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉండనుండడంతో రవాణా సౌకర్యం మెరుగవుతుంది. దీంతో పరిశ్రమలతో పాటు ఈ ప్రాంతంలో భూ విలువలు భారీగా పెరిగే అవకాశం ఉంది. పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి అవకాశాలు మెండుగా లభించే వెసులుబాటు ఏర్పడనుంది. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే మార్గంలో భాగంగా ఇప్పటికే గజ్వేల్ సిద్దిపేట వరకు రైలు మార్గం ఏర్పడడంతో అటు గూడ్స్, ఇటు ప్రజా రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుండడంతో ఈ ప్రాంతం భవిష్యత్తులో భారీగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని స్థానికులు భావిస్తున్నారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మాతృవియోగం


సత్తెమ్మ (ఫైల్)

మద్దూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి కొమ్మూరి సత్తెమ్మ(88) గురువారం అనారోగ్యంతో కన్ను మూశారు. కుటుంబ సభ్యులు సత్తెమ్మ అంత్యక్రియల్ని మండలంలోని స్వగ్రామమైన నర్సాయపల్లిలో గురువారం నిర్వహించారు. ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మితో పాటు నియోజకవర్గంలోని పలువురు జిల్లా మండల నాయకులు కొమ్మూరి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సత్తెమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

గ్రూప్-2లో ర్యాంకు సాధించిన మణికంఠేశ్వర్‌రెడ్డికి సన్మానం

హుస్నాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2లో 103వ ర్యాంకు సాధించిన మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత తనయుడు అయిలేని మణికంఠేశ్వర్‌రెడ్డిని హుస్నాబాద్ పట్టణంలోని శివాజీనగర్‌లో గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీఎంపీపీ ఆకుల వెంకట్, అయిలేని అనిత, శ్రీనివాస్‌రెడ్డి, బోజు రమాదేవి, కొమురవెల్లి రవీందర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన వెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాలు



సిద్దిపేట కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం (పాత) 55వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సంగీత విభావరితో ఏకాంత సేవా నిర్వహించారు. స్వామివారి కీర్తనలతో నిర్వహించిన భజన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


భజనలు చేస్తున్న భక్తులు